సమష్టి కృషితో స్వచ్ఛత గ్రామాలు

- పారిశుధ్య పనులు చేపట్టాలి
- గ్రామ సమస్యలను సత్వరమే పరిష్కరించాలి
- డీఆర్డీవో శ్రీనివాస్

నర్సాపూర్ :రెడ్డిపల్లిలో స్పెషల్ ఆఫీసర్ ప్రవీణ్‌కుమార్

కొల్చారం: పాతంశెట్టిపల్లిలో.. నల్లాను పరిశీలిస్తున్న డీఆర్డీవో

కొల్చారం/ నర్సాపూర్/ చేగుంట/ చిలిపిచెడ్, ఫిబ్రవరి 7: సమష్టి కృషితో స్వచ్ఛత గ్రామాలు సాధ్యమని, వీధులన్నీ పరిశుభ్రంగా ఉండేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని డీఆర్డీవో శ్రీనివాస్ అన్నారు. కొల్చారం మండల కేంద్రంలో బుధవారం ప్రత్యేకాధికారి, ఎంపీడీవో గణేశ్ రెడ్డి అధ్యక్షతన ప్రత్యేక పారిశుధ్య వారోత్సవాలపై గ్రామసభ నిర్వహించారు. ప్రజలు అధికారులతో కలిసి గ్రామాల్లో స్వచ్ఛత, పచ్చదనం పెంపుతోపాటు పారిశుధ్యంపై దృష్టి సారించాలని డీఆర్డీవో శ్రీనివాస్ సూచించారు. గ్రామసభలో పంచాయతీ కార్యదర్శి అంజయ్య, ఉపసర్పంచ్ నింగోల్ల చెన్నయ్య, కారోబార్ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

రెడ్డిపల్లి గ్రామంలో గ్రామసభ

నర్సాపూర్ మండలం రెడ్డిపల్లి గ్రామంలో స్పెషల్ ఆఫీసర్ ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. సభలో గ్రామంలో చేపట్టాల్సిన పనులపై చర్చించారు. పారిశుధ్యంపై సిబ్బందికి పలు సూచనలు చేశారు. గ్రామసభలో మాజీ ఉపసర్పంచ్ అశోక్‌గౌడ్, కార్యదర్శి సునీత, గ్రామస్తులు పాల్గొన్నారు.

పారిశుధ్యంపై దృష్టి పెట్టాలి : ఎంపీపీ

నార్సింగి మండలం వల్లూర్ గ్రామంలో నిర్వహించిన గ్రామసభలో ఎంపీపీ సబితారవీందర్ పాల్గొన్నారు. గ్రామాల్లో పారిశుద్ధ్య సమస్యలపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. సభలో తహసీల్దార్ షేక్ కరీం, కార్యదర్శి అంజిరెడ్డి, అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

పనులు చేపట్టాలి : ఎంపీవో

చిలిపిచెడ్ మండలంలోని అన్ని గ్రామాల్లో 14వ తేదీ వరకు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు ఎంపీవో శరత్‌కుమార్‌రెడ్డి తెలిపారు. చండూర్, చిట్కుల్, అజ్జమర్రి, సోమక్కపేట, గౌతాపూర్, ఫైజాబాద్ గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించి, పారిశుధ్య పనులపై చర్చించారు. చండూర్‌లో ప్రత్యేకాధికారి హరిసింగ్ మాట్లాడుతూ గ్రామ సమస్యలను పరిష్కరిస్తామన్నారు. గ్రామసభలో కార్యదర్శి జితేందర్, ఏపీవో శ్యామ్‌కుమార్ పాల్గొన్నారు.

పోతంశెట్‌పల్లి కార్యదర్శిపై ఆగ్రహం

కొల్చారం మండలం పోతంశెట్‌పల్లిలో కార్యదర్శిపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రత్యేకాధికారి ఇర్ఫాన్ హుస్సేన్ అధ్యక్షతన గ్రామసభ జరిగింది. పంచాయతీ కార్యదర్శి నిర్లక్ష్యంతో గ్రామంలో పారిశుధ్యం లోపించిందన్నారు. కార్యదర్శి సకాలంలో పింఛన్లు ఇవ్వడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామసభలో అంగన్‌వాడీ, ఆశ వర్కర్లు ఉన్నారు.

ఉచిత విద్యుత్‌కు ధ్రువపత్రాలు ఇవ్వాలి

మండల సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ స్వరూపానరేందర్‌రెడ్డి

- గ్రామాల్లో ఉపాధి పనులు చేపట్టాలి
- 15న కొండపోచమ్మసాగర్ నుంచి నీటి విడుదల
- ఎంపీపీ స్వరూపా నరేందర్‌రెడ్డి, ఏఈ వెంకటేశ్వర్లు

వెల్దుర్తి, ఫిబ్రవరి 7: 200 యూనిట్ల ఉచిత విద్యుత్ కోసం లబ్ధిదారులు రేషన్, ఆధార్, కరెంట్ బిల్లు, మొబైల్ నంబర్ జిరాక్స్ పత్రాలను విద్యుత్‌శాఖ సిబ్బందికి ఇవ్వాలని ఏఈ వెంకటేశ్వర్లు సూచించారు. ఎంపీపీ స్వరూపా నరేందర్‌రెడ్డి అధ్యక్షతన బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సర్పంచ్‌ల పదవీకాలం ముగియడంతో ఎంపీటీసీతో పాటు అధికారులు సమావేశానికి హాజరయ్యారు. ఈ నెల 15న కొండపోచమ్మసాగర్ నుంచి గోదావరి జలాలను విడుదల చేస్తామని, 25లోగా హల్దీవాగులో నీళ్లు ప్రవహిస్తాయని ఇరిగేషన్ డీఈఈ రాజేందర్ తెలిపారు. హల్దీవాగుపై నాలుగు చెక్‌డ్యామ్‌లను నిర్మించడానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామన్నారు. ఎంపీపీ స్వరూప మాట్లాడుతూ.. గ్రామాల అభివృద్ధితోపాటు ఇంటింటికీ ప్రభుత్వ పథకాలను చేరవేయడానికి సమన్వయంతో పనిచేయాల న్నారు. సమావేశంలో వైస్ ఎంపీపీ సుధాకర్‌గౌడ్, తూప్రాన్ డీఎల్పీవో శ్రీనివాస్, తహసీల్దార్లు తులసీరాం, జ్ఞానజ్యోతి, ఎంపీడీవో వెంకటలక్ష్మమ్మ, ఏపీవో రాజు, ఎంపీవో విష్ణేశ్వర్, అధికారులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

రోడ్డు నిబంధనలు పాటించాలి

నిజాంపేట పోలీస్‌స్టేషన్‌లో వాహనదారులతో మాట్లాడుతున్న సీఐ వెంకటేశం

రామాయంపేట/ నిజాంపేట/ అల్లాదుర్గం, ఫిబ్రవరి 7: వాహనదారులు రోడ్డు భద్రత నియమాలను పాటించాలని రామాయంపేట సీఐ వెంకటేశం తెలిపారు. బుధవారం నిజాంపేట పోలీస్‌స్టేషన్‌ను ఆయన సందర్శించారు. పోలీస్‌స్టేషన్‌లో వాహనదారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ వెంకటేశం మాట్లాడుతూ సమావేశంలో ఎస్సై శ్రీనివాస్‌రెడ్డి, పోలీస్ సిబ్బంది, వాహనదారులు పాల్గొన్నారు. రామాయంపేటలో వాహనదారులు రోడ్డు నిబంధనలు పాటించాలని ఎస్సై రం జిత్ సూచించారు. రామాయంపేట బస్టాండులో ఆర్టీసీ బస్సులు లోనికి రాకుండా ప్రైవేటు వాహనాలను అడ్డుగా పార్కింగ్ చేస్తున్నారని, ఇలా పార్కింగ్ చేస్తే కేసులు నమోదు చేసి, జరిమానా విధిస్తామన్నారు.

అల్లాదుర్గంలో

రోడ్డు భద్రతా నిబంధ నలు పాటించాలని, లేకపోతే మోటర్ వాహన చట్టం కింద చర్యలు తీసుకుంటామని సీఐ రేణుక హెచ్చరించారు. అల్లాదుర్గం మండలకేంద్రంలో రోడ్డు భద్రతా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ రేణుక మాట్లాడుతూ వాహనదారులు తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్ తీసుకోవాలని, డ్రైవర్లు యూనిఫాం ధరించి వాహనాలను నడపాలని సూచించారు. పరిమితికి మించి ప్రయాణికులను తరలించినా, మద్యం సేవించి వాహనాలను నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సీఐ వెంట ఎస్సై ప్రవీణ్‌రెడ్డి, ఏఎస్సై దేవదాస్, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

16న సమ్మెను జయప్రదం చేయాలి

మెదక్ మున్సిపాలిటీ/పాపన్నపేట, ఫిబ్రవరి 7: కేంద్రంలో ని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న మత రాజకీయాలను తిప్పికొట్టాలని సీఐటీయూ నాయకులు మల్లేశం,అశోక్, మాణిక్యం పిలుపునిచ్చారు. బుధవారం జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి బస్వారాజు, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి నందం, బీఆర్టీయూ జిల్లా కార్యదర్శి వీరేశంతో కలిసి ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలను అడ్డుకోవడానికి ప్రజలందరూ ఉద్యమించాలన్నారు. ఈ నెల 16న దేశవ్యాప్తంగా గ్రామీణ బంద్, పారిశ్రామిక బంద్‌కు పిలుపునిచ్చాయని, బంద్‌కు ప్రజలందరూ సహకరించాలని కోరారు.

పల్లె దవాఖానల్లో మెరుగైన వైద్యసేవలు

చిలిపిచెడ్‌లో పల్లె దవాఖానను పరిశీలిస్తున్న సైకియాట్రిస్ట్ డాక్టర్ శ్వేత

చిలిపిచెడ్, ఫిబ్రవరి 7 : ప్రభుత్వం గ్రామాల్లో ఏర్పాటు చేసిన పల్లె దవాఖానల్లో నాణ్యమైన వైద్యసేవలు లభిస్తున్నాయని సైకియాట్రిస్ట్ డాక్టర్ శ్వేత తెలిపారు. పల్లె దవాఖానలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. బుధవారం చిలిపిచెడ్ మండలకేంద్రంలో పల్లె దవాఖానను పరిశీలించారు. పల్లె దవాఖానలో బీపీ, షుగర్‌తో పాటు మొత్తం 10 రకాల వ్యాధులకు సంబంధించిన టెస్టులు చేసి, మందులు ఇస్తున్నట్లు తెలిపారు. పల్లె దవాఖానలో డాక్టర్లు ప్రజలకు నిత్యం అందుబాటు ఉంటారన్నారు. గ్రామాల్లో మానసిక రోగుల వివరాలను పల్లె దవాఖానలో తెలియజేయాలని సూచించారు. ఆమె వెంట వైద్య సిబ్బంది, ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ టీచర్లు ఉన్నారు.

మహిళలకు రమాబాయి ఆదర్శం

రమాబాయి చిత్రపటానికి ఎంపీపీ సిద్ధిరాములు, సంజీవ్ నివాళి

నిజాంపేట, ఫిబ్రవరి 7: మండలంలోని నస్కల్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో డీబీఎఫ్ జిల్లా అధ్యక్షుడు సంజీవ్ అధ్వర్యంలో అంబేద్కర్ సతీమణి రమాబాయి జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ సిద్ది రాములు, సంజీవ్ మాట్లాడుతూ.. అంబేద్కర్ సాధించిన విజయాల వెనుక రమాబాయి కృషి ఎంతో ఉందన్నారు. మహిళలకు రమాబాయి ఆదర్శమన్నారు. కార్యక్రమంలో ప్రత్యేకాధికారి శరత్, పంచాయతీ కార్యదర్శి సబిత, అంగన్‌వాడీ కార్యకర్తలు మంజుల, పద్మ, గోదావరి, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

14న మున్సిపల్ దుకాణాలకు వేలంపాట

మెదక్ మున్సిపాలిటీ, ఫిబ్రవరి 7 : జిల్లా కేంద్రం మెదక్ పాత బస్టాండ్ ఎదురుగా ఉన్న మున్సిపాలిటీకి చెందిన 17 దుకాణాలకు ఈ నెల 14న ఉదయం 10:30 గంటలకు మున్సిపల్ కార్యాలయంలో బహిరంగ వేలంపాట నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ జానకీరామ్‌సాగర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. దుకాణాలకు దరఖాస్తు చేసుకున్నవారు దరఖాస్తు ఫారం రసీదు, ఆధార్ కార్డుతో వేలంలో పాల్గొనాలని సూచించారు.

మాఘ అమావాస్యకు ఆలయాలు ముస్తాబు

కొప్పోల్‌లో ఉమాసంగమేశ్వర ఆలయం

పెద్దశంకరంపేట, జనవరి 9 : దక్షిణకాశీగా పేరుగాంచిన కొప్పోల్ ఉమాసంగమేశ్వర ఆలయం మాఘ అమావాస్య కు ముస్తాబవుతున్నది. ఈ నెల 9న మాఘ అమావాస్య సందర్భంగా ఆలయంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు పూర్తి చేస్తున్నారు. ఉత్సవాల సందర్భంగా భక్తులకు అన్నదానం చేస్తున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు పద్మా బాపిరాజు తెలిపారు.

రేపు నర్సింహ స్వామి జాతర

రామాయంపేట, ఫిబ్రవరి 7 : రామాయంపేట పట్టణంలో ఈ నెల 9న నర్సింహస్వామి జాతర నిర్వహిస్తున్నారు. ఆలయంలో జాతర ఏర్పాట్లు పూజారి వెంకటరమణాచారి ఆధ్వర్యంలో కొనసాగుతున్నాయి. పట్టణ శివారులో గుట్టపై వెలిసిన నర్సింహస్వామి భక్తులకు కొంగుబంగారంగా నిలుస్తున్నారు. గుట్టపై జరిగే జాతరకు భక్తులు అధిక సంఖ్యలో తరలిరావాలని నిర్వాహకులు కోరారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

వెల్దుర్తి, ఫిబ్రవరి 7: గ్రామాలను స్వచ్ఛతగా తీర్చిదిద్దడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎంపీపీ స్వరూపానరేందర్‌రెడ్డి, ఎంపీడీవో వెంకటలక్ష్మమ్మ సూచించారు. బుధవారం ఆయా గ్రామాల్లో శానిటేషన్‌పై గ్రామసభలు నిర్వహించారు. నెల్లూర్ గ్రామసభలో ఎంపీపీ, మాసాయిపేట మండలంలోని హక్కీంపేట, కొప్పులపల్లిలో ఎంపీడీవో పాల్గొన్నారు. గ్రామసభల్లో వైస్ ఎంపీపీ సుధాకర్ గౌడ్, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

నిజాంపేటలో..

నిజాంపేట, ఫిబ్రవరి 7 : మండల వ్యాప్తంగా ప్రత్యేకాధికారులు, పంచాయతీ కార్యదర్శులు బుధవారం స్పెషల్ శానిటేషన్ డ్రైవ్‌పై గ్రామసభలు నిర్వహించారు. నందిగామ గ్రామపంచాయతీ కార్యాలయంలో ప్రత్యేకాధికారి రాజేందర్ అధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. గ్రామసభలో ఎంపీటీసీ సురేశ్, ఆశ వర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు ఉన్నారు. సమస్యల పరిష్కారానికి అధికారులు కృషి చేయాలి

పెద్దశంకరంపేటలో..

పెద్దశంకరంపేట, ఫిబ్రవరి 7: గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి అధికారులు కృషి చేయాలని మండల ప్రత్యేకాధికారి, డీఎఫ్‌వో రవిప్రసాద్ అన్నారు. బుధవారం గొట్టిముక్కుల గ్రామంలో గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధిహామీ పనులతోపాటు నర్సరీలను ఎంపీడీవో కలిసి పరిశీలించారు. అన్ని గ్రామాల్లో స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ నిర్వహించాలన్నారు. వేసవిలో నీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామసభలో ఎంపీడీవో రఫీకున్నీసా, ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ వికాస్, ఎంపీటీసీ దత్తు పాల్గొన్నారు.

చోరీ కేసులో ఒకరి అరెస్ట్

రికవరీ చేసిన ఆటోలు చూపుతున్న పోలీసులు

మెదక్ అర్బన్, ఫిబ్రవరి 7: ఆటో దొంగతనం చేసిన వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు మెదక్ పట్టణ సీఐ దిలీప్ బుధవారం తెలిపారు. మెదక్ పట్టణంలో బుధవారం వెల్‌కమ్ బోర్డు వద్ద వాహనాల తనిఖీలు చేస్తుండగా, హవేళీఘనపూర్ మండలం మద్దుల్వాయి గ్రామానికి చెందిన గజ్జల భిక్షపతి అలియాస్ నవీన్ ఆటో నడుపుకుంటూ వస్తుండగా పోలీసులు తనిఖీ చేశారు. ఆటోకు సంబంధించిన పత్రాలను చూపించమని కోరగా.. భిక్షపతి పారిపోవడానికి ప్రయత్నించాడు. వెంటనే అతడిని అదుపులోకి తీసుకొని విచారించగా మెదక్ పట్టణంలో మూడు ఆటోలు, గుమ్మడిదల పోలీస్‌స్టేషన్ పరిధిలో ఒక ఆటోను దొంగతనం చేశానని ఒప్పుకున్నట్లు తెలిపారు. నిందితుడి నుంచి ఆటోలు రికవరీ చేసి, జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించినట్లు సీఐ దిలీప్ తెలిపారు.

చేపల వేటకు వెళ్లి ముగ్గురు మృతి



పర్కిబండ చెరువులో పడి మృతి చెందిన బుర్రి యాదయ్య, మహ్మద్ యాసిన్‌ఖాన్

మనోహరాబాద్/చేగుంట, ఫిబ్రవరి 7: చేపల వేటకు వెళ్లి ఇద్దరు మృత్యువాత పడిన ఘటన పర్కిబండలో జరిగిది. ఎస్సై కరుణాకర్‌రెడ్డి తెలిపిన వివరాలు... పర్కిబండకు చెందిన బుర్రి యాద య్య (58), మహ్మద్ యాసిన్ ఖాన్ (60), చేగుంట మండలం పోలంపల్లికి చెందిన యాట లక్ష్మణ్(23) చెరువులో చేపలు పట్టడానికి వెళ్లారు. గ్రామస్తులు, పోలీసులు చెరువులో గాలింపు చేపట్టి మృతదేహాలను వెలికి తీశారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కరుణాకర్‌రెడ్డి తెలిపారు. యాట లక్ష్మణ్ కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు చేగుంట ఎస్సై హరీశ్‌గౌడ్ తెలిపారు.

వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరికి తీవ్ర గాయాలు

రామాయంపేట, దామరచెరువు శివారులో రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తులు

రామాయంపేట, ఫిబ్రవరి 7: రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు తీవ్రంగా గాయపడిన ఘటన రామాయంపేట శివారులోని జాతీయ రహదారి వద్ద బుధవారం జరిగింది. రామాయంపేట బైపాస్‌లో ఆధ్య హోటల్ వద్ద తెల్లవారుజామునే ఓ వ్యక్తి బైక్‌పై వస్తుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. మరో ఘటనలో రామాయంపేట మండలం దామరచెర్వు శివారులో బైక్ అదుపు తప్పి, చెట్టుకు ఢీకొనడంతో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. గాయపడినవారిని 108 అంబులెన్స్ వాహన సిబ్బంది రామాయంపేట ప్రభుత్వ దవాఖానకు తరలించారు. రోడ్డు ప్రమాదాలపై రామాయంపేట పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

పారదర్శకంగా ఈవీఎం ఎఫ్ఎల్‌సీ పరిశీలన

- కలెక్టర్ రాజర్షి షా

ఈవీఎంలను పరిశీలిస్తున్న కలెక్టర్ రాజర్షి షా

మెదక్, ఫిబ్రవరి 7 (నమస్తే తెలంగాణ) : జాతీయ ఎన్నికల సంఘం ఆదేశాలతో ఈవీఎం యంత్రాల మొదటిస్థాయి తనిఖీని ఇంజినీర్ల సమక్షంలో పారదర్శకంగా నిర్వహిస్తున్నామని కలెక్టర్ రాజర్షి షా తెలిపారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల కొరకు నిర్వహిస్తున్న ఎఫ్ఎల్‌సీ, వెబ్‌కాస్టింగ్, ఈవీఎం నిర్వహణ విధానాన్ని బుధవారం మెదక్ పట్టణంలో పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. రానున్న పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా మెదక్ జిల్లాలో రాజకీయ పార్టీల నాయకుల సమక్షంలో ఫిబ్రవరి 5 నుంచి 9 వరకు ఈసీఐఎల్ ఇంజినీర్ల బృందం ఎఫ్ఎల్‌సీ, ఎన్నికల ఏర్పాట్లను పరిశీలిస్తున్నట్లు పేర్కొన్నారు. 1197 బ్యాలెట్ యూనిట్లు (28శాతం), 777 కంట్రోల్ యూనిట్లు (32 శాతం), 911 వీవీప్యాట్లు (27శాతం) పరిశీలన పూర్తయిందన్నారు. కలెక్టర్ వెంట మెదక్ ఆర్డీవో రాజేశ్వర్, జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ హర్దీప్‌సింగ్, సిబ్బంది ఉన్నారు.

ఉద్యోగులకు సేవలతోనే గుర్తింపు

బదిలీపై వెళ్తున్న ఎస్సై బాలరాజును సన్మానిస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

పెద్దశంకరంపేట, ఫిబ్రవరి 7 : ప్రభుత్వ ఉద్యోగులకు తమ ఉద్యోగకాలం లో చేసిన సేవలతోనే గుర్తింపు వస్తుందని నారాయణఖేడ్ ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి అన్నారు. పెద్దశంకరంపేట పోలీస్‌స్టేషన్‌లో కామారెడ్డి జిల్లా తడ్వాయి పోలీస్‌స్టేషన్‌కు బదిలీపై వెళ్తున్న ఎస్సై బాలరాజును ఎమ్మెల్యే సంజీవరెడ్డి సన్మానించారు. ప్రభుత్వ ఉద్యోగులకు బదిలీలు సహజమేనని, ప్రజలకు సేవ చేసి మంచిపేరు తెచ్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అల్లాదుర్గం సీఐ రేణుకారెడ్డి, ఎస్సై శంకర్, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

తగిన మోతాదులో ఎరువులు వాడాలి

రామాయంపేట, ఫిబ్రవరి 7 : రైతులు పంటలకు నియమిత మోతాదులో ఎరువులు వాడాలని, అధిక మొత్తంలో ఎరువులు వేస్తే నష్టపోతారని మండల వ్యవసాయాధికారి రాజ్‌నారాయణ సూచించారు. మంగళవారం రామాయంపేట మండలంలోని వివిధ గ్రామాల్లో పర్యటించి వరి పంటలను పరిశీలించారు. మొగిపురుగు నివారణ చర్యలను రైతులకు వివరించారు. తక్కువ మొత్తంలో యూరియా వాడాలని, పంటలకు నీటి తడులు తక్కువగా ఉండాలని సూచించారు. సేంద్రియ ఎరువుల వాడకాన్ని పెంచాలన్నారు. ఏవో వెంట ఏఈవో సాయికృష్ణ, రైతులు ఉన్నారు.

డ్రైనేజీ సమస్యను పరిష్కరిస్తాం

నర్సాపూర్ 1వ వార్డులో డ్రైనేజీ పనులు పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్

నర్సాపూర్, ఫిబ్రవరి 7: మున్సిపాలిటీలో డ్రైనేజీ సమస్యను పరిష్కరిస్తామని మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్ తెలిపారు. బుధవారం మున్సిపల్‌లోని 1వ వార్డులో మున్సిపల్ చైర్మన్ పర్యటించి, డ్రైనేజీ పనులు పరిశీలించారు. ఆయన వెంట మున్సిపల్ కమిషనర్ వెంకట్‌గోపాల్, నాయకులు నగేశ్, ఆంజనేయులుగౌడ్, కాలనీవాసులు ఉన్నారు.

క్యారమ్స్ పోటీలకు ఎంపీవో ఎంపిక

సతీశ్

మెదక్ మున్సిపాలిటీ, ఫిబ్రవరి 7 : రాష్ట్ర ప్రభుత్వం ఏటా నిర్వహించే ఆలిండియా సివిల్ సర్వీసెస్ క్రీడా పోటీలు నిర్వహిస్తున్నది. గత జూలైలో నిర్వహించిన జిల్లాస్థాయి క్యారమ్స్ పోటీల్లో మనోహరాబాద్ మండల పంచాయతీ అధికారి(ఎంపీవో) సతీశ్ ప్రథమ స్థానంలో నిలిచాడు. ఆగస్టులో జరిగిన రాష్ట్రస్థాయిలో పోటీల్లో మూడో స్థానంలో నిలిచినట్లు జిల్లా క్రీడలు, యువజన శాఖాధికారి నాగరాజు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 10 నుంచి 15 వరకు బీహార్ రాష్ట్రం పాట్నాలోని పాటలీపుత్ర స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో నిర్వహించనున్న జాతీయస్థాయిలో పోటీల్లో సతీశ్ పాల్గొంటారన్నారు. రాష్ట్రం నుంచి 14 మంది క్రీడాకారులు ఎంపికయ్యారని, మెదక్ జిల్లా నుంచి సతీష్ జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంటున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా సతీష్‌ను కలెక్టర్ రాజర్షిషా, జిల్లా పంచాయతీ అధికారి సాయిబాబా అభినందించారు.

లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం

రేగోడ్, పిబ్రవరి 7 : రేగోడ్ మండల కేంద్రంలోని బసవేశ్వర చౌక్ వద్ద బుధవారం పెద్దశంకరంపేట మండలకేంద్రానికి చెందిన న్యూ శివదత్త దవాఖాన సహకారంతో లయన్స్‌క్లబ్ ప్రతినిధులు ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. సుమారు 150 మందికి పరీక్షలు నిర్వహించి, మందులు అందజేశారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ చైర్మన్ సంగమేశ్వర్, సభ్యులు చోటుబాయ్, మాజీ పీఏసీఎస్ చైర్మన్ రాధాకిషన్‌గుప్తా, గిరిజన నాయకుడు పీర్యానాయక్, ఎంపీటీసీ శ్రీకాంత్‌నాయక్, నాయకులు దిగంబర్ పాటిల్, కిషన్, శంకర్, శివకుమార్, డాక్టర్ కరిష్మా, అనిల్‌కుమార్ గౌడ్, మహానంద, సంతోష్ పాల్గొన్నారు.

ఆదర్శ పాఠశాలల్లో ప్రవేశాలు

మెదక్ మున్సిపాలిటీ, ఫిబ్రవరి 7: ఆదర్శ పాఠశాలల్లో 2024-25 విద్యా సంవత్సరానికి 5 నుంచి 10వ తరగతుల్లో చేరడానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు డీఈవో రాధాకిషన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 12 నుంచి 22లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఓసీ విద్యార్థులు రూ.200, బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఈడబ్ల్యూఎస్, దివ్యాంగ విద్యార్థులు రూ.125 పరీక్ష ఫీజు చెల్లించాలని, వివరాలకు telanganams.cgg. gov. in వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.

మోడల్ స్కూల్‌లో ప్రవేశాలు

పెద్దశంకరంపేట, ఫిబ్రవరి 7: స్థానిక మోడల్ పాఠశాలలో 6వ తరగతిలో ప్రవేశానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ విఠల్‌నాయక్ తెలిపారు. ఆదర్శ పాఠశాలలో ఉపాధ్యాయులతో కలిసి కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ నెల 22 లోగా దరఖాస్తు చేసుకోవాలని, ఏప్రిల్ 1న హాల్‌టికెట్ డౌన్‌లోన్ చేసుకోవాలని, ఏప్రిల్ 7న ప్రవేశ పరీక్ష, మే 25న అడ్మిషన్ జాబితా ప్రకటిస్తామన్నారు. 7 నుంచి 10వ తరగతి వరకు ఖాళీగా ఉన్న సీట్లకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ఉద్యోగులకు ఉచిత ఐటీ సేవలు

మెదక్ మున్సిపాలిటీ, ఫిబ్రవరి 7: తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో బుధవారం ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఉచిత ఐటీ సేవలను ప్రారంభించారు. తపస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎల్లం, లక్ష్మణ్ మాట్లాడారు.కార్యక్రమంలో తపస్ నాయకులు మాధవరెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, సతీశ్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

బీమా చెక్కు అందజేత

బీమా చెక్కు అందజేస్తున్న నాయకులు

తూప్రాన్, ఫిబ్రవరి 7 : తూప్రాన్ పట్టణానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు కడమంచి పెంటయ్య గతేడాది రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. పెంటయ్యకు బీఆర్ఎస్ సభ్యత్వ బీమా ఉండడంతో రూ. 2 లక్షల చెక్కు మంజూరైంది. బేడ బుడగ జంగాల జిల్లా అధ్యక్షుడు చింతల దశరథ బుధవారం మృతుడి భార్య అన్నమ్మకు బీమా చెక్కు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు చింతల పెద్ద నర్సింహులు, ప్రమోద్, చింతల నర్సింహులు, కోటేశ్ తదితరులు పాల్గొన్నారు.

వందశాతం ఉత్తీర్ణత సాధించాలి

చిన్నశంకరంపేట, ఫిబ్రవరి 7 : పదో తరగతి విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణత సాధించడానికి ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఉపాధ్యాయులకు ఎంఈవో బచ్చయ్యనాయక్ సూచించారు. బుధవారం కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాన్ని బుధవారం సందర్శించి, విద్యార్థినులతో మాట్లాడారు. ఎంఈవో వెంట ఎస్‌వో గీత, సీఆర్పీ సందీప్, కేజీబీవీ అధ్యాపకులు ఉన్నారు.

మెదక్ రూరల్ సీఐగా కేశవులు

కేశవులు, సీఐ

మెదక్ రూరల్, ఫిబ్రవరి 7: మెదక్ రూరల్ సీఐగా కేశవులు బుధవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ పని చేసిన సీఐ రాజశేఖర్‌రెడ్డి మల్టీజోన్‌కు బదిలీ కాగా, ఆయన స్థానంలో హైదరాబాద్ సీఐడీ నుంచి కేశవులు బదిలీపై ఇక్కడికి వచ్చారు.

9న క్రీడాకారుల ఎంపిక

పాపన్నపేట, ఫిబ్రవరి 7: మండలంలోని యూసూఫ్‌పేట గ్రామంలో ఈ నెల 9న సబ్ జూనియర్ క్రీడాకారుల ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి రమేశ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాస్థాయికి ఎంపికైన క్రీడాకారులకు ఈ నెల 16 నుంచి 19 వరకు సూర్యాపేటలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. పూర్తి వివరాలకు 9010735121 ఫోన్ నంబరును సంప్రదించాలని కోరారు.

స్వచ్ఛతే లక్ష్యం కావాలి



మాట్లాడుతున్న డీపీవో సాయిబాబా

టేక్మాల్, ఫిబ్రవరి 7 : మండల కేంద్రంలోని గాంధీ భవన్‌లో బుధవారం ఎంపీడీవో రియాజొద్దీన్ ఆధ్వర్యంలో పారిశుధ్య వారోత్సవాలు ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి అందోల్ నియోజకవర్గ ప్రత్యేకాధికారి, డీపీవో సాయిబాబాతోపాటు నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
WANTED
★ త్రివేణి హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 18K. 9160900024 / 9640400073. NT-319433-All
గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.